సాక్షి అనకాపల్లి


బుధవారం । 8 । నవంబర్ । 2023



ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యం

పరవాడ పోలీసులు ఓ ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటనపై ఎస్పీ స్పందించారు. నలుగురిపై చర్య తీసుకున్నారు.

IIలో



12 నుంచి ఆర్జిత సేవలు రద్దు

సింహగిరిపై ఈ నెల 12 నుంచి 16 వరకు తిరునక్షత్ర పూజలు నిమిత్తం ఆయా తేదీల్లో ఆర్జితసేవలు రద్దు చేసినట్టు ఈవో తెలిపారు.

వాతావరణం

అనకాపల్లి టౌన్: రాగల ఐదురోజుల్లో మూడు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, రెండు రోజుల పాటు స్వల్ప వర్షసూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న 8 మి.మీ., 10న 4, 11న 5 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదు కావచ్చన్నారు.

న్యూస్‌రీల్

నేడు మునగపాకలో జగనన్నకు చెబుదాం

తుమ్మపాల: ఈ నెల 8న మునగపాక మండలంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని, ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

తుమ్మపాల: ఏపీ ఓపెన్ స్కూల్ 2023–24 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈ నెల 10 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు www. apopen school.ap.gov. in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని, దగ్గర్లోని ఓపెన్ స్కూల్ కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి, ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చన్నారు. 14 ఏళ్ల వయసు కలిగి, టీసీతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల వారు కులధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. దివ్యాంగులు వైద్య ధ్రువీకరణ పత్రం, విద్యార్హత లేని వారు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు, స్వీయ ధ్రువీకరణ సమర్పించి ప్రవేశం పొందాలని సూచించారు.

హోంగార్డు కుటుంబానికి సహచరుల ఆర్థిక సాయం



అనకాపల్లి టౌన్: ఉమ్మడి విశాఖ జిల్లాలో పని చేసి రైలు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు ఎస్.గౌరీశంకర్ తల్లి అప్పలకొండకు హోంగార్డుల ఒకరోజు వేతనం రూ.3,87,660లు అందజేసినట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. తమ కార్యాలయంలో మంగళవారం మృతుడి తల్లికి చెక్కును అందజేశారు. మృతునికి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న హోంగార్డులు వారికి వచ్చే ఒకరోజు డ్యూటీ అలవెన్సును ఆర్థిక సహాయంగా అందజేసినట్లు ఆయన చెప్పారు.

పుంత రోడ్లకు మహర్దశ

- తారు రోడ్లుగా మారనున్న 20 మట్టి రోడ్లు
- రూ.62 కోట్లతో 82 కి.మీ. మేర తారు రోడ్లు

జిల్లాలో మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఏళ్లతరబడి మట్టిరోడ్లు, పుంత రోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్న చాలా గిరిజన, మైదాన ప్రాంత ప్రజల కల నెరవేరనుంది. అలాంటి రోడ్లను ప్రభుత్వం పక్కా రోడ్లుగా మార్చేందుకు తాజాగా నిధులు మంజూరు చేసింది. జిల్లాలో రూ.62 కోట్లతో 81.77 కిలోమీటర్ల మేర 20 మట్టి రోడ్లను తారు రోడ్లుగా చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



తారురోడ్డు కానున్న సుందరకోట - అసనగిరి మట్టి రోడ్డు



అసనగిరికి కాలినడకన వెళ్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి (ఫైల్)

నాతవరం: గిరిజన, మైదాన ప్రాంత గ్రామాలకు పూర్తి స్థాయిలో రహదారుల్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. దీంతో కశింకోట, అనకాపల్లి రూరల్, రాంబిల్లి, యలమంచిలి, నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లోని మైదాన ప్రాంతాల్లో గ్రామాల మధ్య లింకు రోడ్లు తారు రోడ్లుగా మారనున్నాయి. వీటితోపాటు నాతవరం, గొలుగొండ, చీడికాడ, రావికమతం, రోలుగుంట మండలాల్లోని గిరిజన గ్రామాల్లో మట్టి రోడ్లు కూడా తారు రోడ్లుగా మార్పు చెందనున్నాయి. ఇందుకు అవసరమైన నిధులుకూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 1వ తేదీ నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. 15లోగా టెండర్లు ఖరారు చేసి, సకాలంలో పనులు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

కలెక్టర్ చొరవతో డోలీ మోతల నుంచి విముక్తి

నాతవరం మండలం సరుగుడు, సుందరకోట గిరిజన పంచాయతీల్లో కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి రెండు పర్యాయాలు పర్యటించారు. సుందరకోట నుంచి అసనగిరి గ్రామానికి సుమారుగా 4 కిలోమీటర్లు కాలి నడకన వెళ్లారు. గిరిజనులు పడే బాధలను స్వయంగా చూశారు. దీంతో సుందరకోట నుంచి అసనగిరి మధ్య పుంత రోడ్డును తారు రోడ్డు చేసేందుకు రూ.2 కోట్ల 5 లక్షలు మంజూరు చేశారు. కొండల మీదనున్న తొరడ, ముంతమామిడి, లొద్దు, బమ్మిడికలొద్దు, కొత్త దద్దుగుల, సిరిపురం గ్రామాలకు ఉపాధి హామీ పథకంలో మట్టి రోడ్లు ఏర్పాటు చేశారు. సుందరకోట, అసనగిరి గ్రామాల మధ్య తారురోడ్డు పూర్తయితే గిరిజనులకు డోలీ మోత నుంచి విముక్తి లభించనుంది.

గ్రామాల అభివృద్ధి.. పెరగనున్న భూముల ధరలు

ఇంతవరకు మారుమూల ప్రాంతాల గ్రామాలకు రోడ్డు సదుపాయాలు లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేవి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సకాలంలో తారురోడ్లు పూర్తి చేస్తే వాహనాల రాకపోకలు పెరగనున్నాయి. వర్షాకాలంలో సైతం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించవచ్చు. మారుమూల గ్రామాల్లో లింకు రోడ్లు అందుబాటులోకి వస్తే ఒక్కసారిగా తమ భూముల రేట్లు కూడా పెరుగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డును ఆనుకుని ఉన్న భూముల్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధికి నోచుకోనున్నాయి.

నియోజకవర్గాల వారీగా రోడ్లకు కేటాయింపులు

నియోజకవర్గం	రోడ్ల సంఖ్య	కిలో మీటర్లు	మంజూరైన నిధులు రూ. కోట్లలో
నర్సీపట్నం	5	15.60	10.85
చోడవరం	6	30.23	15.99
అనకాపల్లి	4	12.34	9.86
యలమంచిలి	2	9.60	12.10
పాయకరావుపేట	2	8.80	7.55
మాడుగుల	1	5.20	5.65

ఊహించలేదు



కొండలపైనున్న మారుమూల గిరిజన గ్రామాలకు తారు రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేస్తారని కలలో కూడా ఊహించలేదు. కలెక్టర్ స్వయంగా మా గ్రామాల్లో పర్యటించి, మా బాధలు చూశారు. న్యాయం చేస్తానని హామీచ్చారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మమ్మల్ని స్వయంగా కలెక్టర్ దగ్గరకు తీసుకెళ్లి రోడ్డు, తాగునీటి సమస్యలను నివేదించారు. ఎమ్మెల్యే చెప్పినట్లే నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, సరుగుడు సిగ్మెంటు

టెండర్ల ప్రక్రియ జరుగుతోంది



జిల్లాలో మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ మేరకు టెండర్లను ఆహ్వానించాం. కొన్ని రోడ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. ఈ నెల 15లోపు జిల్లావ్యాప్తంగా మంజూరైన రోడ్లకు టెండర్లు ఖరారు చేయనున్నాం. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులతో రోడ్డు పనులు ప్రారంభించి, సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

– డీఎస్ రవీంద్ర, ఎస్ఈ, పంచాయతీరాజ్

మువ్వన్నెల రెపరెపలు

- అనకాపల్లి ముఖద్వారం వద్ద భారీ జాతీయ పతాకం ఏర్పాటు
- ఎంపీ సత్యవతి సూచనతో నెలకొల్పిన ఎన్టీపీసీ





జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, ఎన్టీపీసీ జీఎం సంజయ్‌కుమార్ సిన్హా

అనకాపల్లి టౌన్: అనకాపల్లి అందాల నగరంగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో పట్టణ ముఖద్వారం వద్ద ఎన్టీపీసీ అతి పెద్ద జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయడం ఆనందకరమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జాతీయ రహదారి జలగల మదుం సమీపంలో మంగళవారం జాతీయ జెండాను ఎంపీ బి.వి.సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనకాపల్లి నూతన జిల్లాగా ఏర్పడిన తరువాత జిల్లా ముఖద్వారం వద్ద పెద్ద సైజులో జాతీయ పతాకం ఎగరాలని ఎంపీ సత్యవతి ఆలోచన చేయడం అభినందనీయమన్నారు. ఆమె సూచనలతో ఎన్టీపీసీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిందన్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో జిల్లాలో రూ.లక్షా 10 వేల కోట్లతో 12 వేల ఎకరాల్లో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దీనిని ఇటీవలే రాష్ట్ర కేబినెట్ ఆమోదించిందన్నారు. సుమారు లక్ష ఉద్యోగాలు వస్తాయని, ఆస్ట్రేలియాకు చెందిన కంపెనీ స్పందించి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ అనకాపల్లి మీదుగా వెళ్లే వారి మదిలో ఈ జెండాను చూడగానే జాతీయ భావం ఉప్పొంగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఎన్టీపీసీ చేసిన కృషి గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, ఎన్టీపీసీ జీఎం ఎం.సంజయ్‌కుమార్ సిన్హా, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వి.కె.ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎన్టీపీసీ మేనేజర్ కె.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం జగన్



రైతులకు రైతు భరోసా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- రైతు భరోసా నిధుల జమ కార్యక్రమంలో కలెక్టర్, ప్రభుత్వ విప్
- 2,65,778 మందికి రూ.109.77 కోట్ల లబ్ధి

అనకాపల్లి టౌన్: జిల్లాలో 2 లక్షల 65 వేల 778 మందికి రైతు భరోసా నిధులు రూ.109.77 కోట్లు జమ అయినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్ నమూనా చెక్కును అందించారు. పుట్టపర్తిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధుల్ని బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షించారు. ఒక్కో లబ్ధిదారు ఖాతాలో రూ.4 వేలు జమ చేసినట్లు పేర్కొన్నారు. విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. రైతులకు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఎక్కువ మొత్తం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.13,500 చొప్పున జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.1572 కోట్ల రైతు భరోసా నిధుల్ని జిల్లా రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా రైతు సలహా సంఘం అధ్యక్షుడు చిక్కాల రామారావు మాట్లాడారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు, బుచ్చియ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నరసింగరావు, కశింకోట వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

అనకాపల్లి టౌన్: హత్యా నేరం నిరూపణ కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో 6 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ అనకాపల్లిలోని 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పినట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. ఎస్పీ కథనం మేరకు... 2017 జూలై 16న విశాఖపట్నం గంగవరం పోర్టు కళాసీలుగా పనిచేస్తున్న కడియం వరహాలు, బెహరా సంజీవరావు నూకాంబిక అమ్మవారి మొక్కు తీర్చుకోవడానికి సహచర కళాసీలతో కలిసి అనకాపల్లి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మధ్యాహ్నం అక్కడే భోజనం తయారు చేసుకుంటున్న సమయంలో మృతుడు, నిందితుడు మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. తన భార్యను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడడంతో వరహాలు మేకులు కలిగిన కర్రతో దాడి జరపగా బెహరా సంజీవరావు అక్కడికక్కడే మృతి చెందాడు.

మేస్త్రి ముచ్చు సన్నిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా వాదోపవాదాల అనంతరం న్యాయమూర్తి నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ చెప్పారు.

కష్టంలో ఉన్నవారికి వైఎస్సార్‌సీపీ అండ

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- బాధిత గిరి కుటుంబాలకు రూ.3 లక్షలు అందజేత



ప్రమాద బాధిత గిరి కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: కష్టకాలంలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవడంలో వైఎస్సార్‌సీపీ ముందుంటుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ముగ్గురు ప్రమాద బాధిత గిరి మహిళల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆయన ఆర్థిక సాయం అందజేశారు. ఈనెల 2న మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు వచ్చి, తిరుగు ప్రయాణంలో జరిగిన వాహన ప్రమాదంలో అవురువాడ పంచాయతీ పెద్దగొర్రిగెడ్డ గ్రామానికి చెందిన గిరి మహిళలు కొప్పల దేముడమ్మ, కిలంబోయిన రాజులమ్మ, బిడిజాన లక్ష్మిలకు స్వల్ప గాయాలైన విషయం తెలిసిందే. వీరికి విశాఖలో చికిత్స చేయించి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన పార్టీ తరపున ముగ్గురికీ రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు అందించనున్నట్లు ప్రకటించారు. ఆ సొమ్మును డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మంగళవారం బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కూడా వివరించామని, ప్రభుత్వం తరుపున రూ.5 లక్షల చొప్పున ముగ్గురికీ రూ.15 లక్షల ప్రమాద పరిహారం మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. కోరిన వెంటనే పార్టీ నుంచి రూ.3 లక్షల తక్షణ సహాయం అందించి, బాధితులను ఆదుకున్నందుకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి బాధిత గిరిజనుల తరపున డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ శేనాపతి కొండలరావు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, ఉప సర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెరుమళ్ళ వెంకటరావు, తంటపురెడ్డి బన్నీ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ చెదల క్రిష్ణందొర పాల్గొన్నారు.

ఉత్సాహంగా రిమ్ జిమ్ పోటీలు



ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో రెండో రోజు రిమ్ జిమ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రెండో రోజు జరిగిన పోటీల్లో విద్యార్థులకు లలిత కళల విభాగంలో మట్టితో బొమ్మలు తయారీ, పోస్టర్ మేకింగ్, థియేటర్ ఆర్ట్స్ విభాగంలో యోగా, ఏకపాత్రాభినయం, బృందగానం పోటీలు, సాహిత్య విభాగంలో తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో కథలు చెప్పుట, కథలు రాయుట, బొమ్మను చూసి దాని గురించి విశ్లేషించుట, స్పెల్ బీ, సుడోకు, మ్యాప్ పాయింటింగ్, ప్రాజెక్టు క్విజ్ వంటి పోటీలు, ఆటలు, క్రీడల విభాగంలో రిలే పరుగు పందాలు, ఖో ఖో, వాలీబాల్ వంటి అనేక పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనల వేదికగా బాలల సైన్స్ కాంగ్రెస్

- యలమంచిలిలో డివిజన్ స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన
- జిల్లా స్థాయికి 24 ప్రాజెక్టుల ఎంపిక



ప్రాజెక్టుతో హరిపాలెం హైస్కూల్ విద్యార్థులు



ప్రాజెక్టులపై విద్యార్థుల వివరణ వింటున్న న్యాయనిర్ణేతలు

యలమంచిలి(అనకాపల్లి రూరల్) : బాలల సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా విద్యార్థులంతా సరికొత్త ఆలోచనలతో ప్రాజెక్టులను రూపకల్పన చేయాలని ఎంఈవో వై.మీనాక్షి ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక కొత్తపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ డివిజన్‌స్థాయి కార్యక్రమం నిర్వహించారు. దీనికి యలమంచిలి డివిజన్ వ్యాప్తంగా 6 మండలాల్లో 60 పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము రూపకల్పన చేసిన ప్రాజెక్టులతో హాజరయ్యారు. అనంతరం న్యాయనిర్ణేతలు 24 ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 9వ తేదీన కశింకోటలో జరగనున్న జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయా పాఠశాలల తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా ఎంఈవో మీనాక్షి, రిసోర్సు పర్సన్ వీవీ గిరి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం న్యాయనిర్ణేతలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం అధ్యాపకులు ఎ.అర్జున అప్పారావు, పి.ఎస్.జగ్గారావు, బి.లత, టి సరళసాన్యలు విద్యార్థుల ప్రాజెక్టు రిపోర్టులను పరిశీలించారు. 24 ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వి.రమణ, ఆలమూరి శ్రీనివాస్, సుసర్ల సూర్యప్రకాష్, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి, ఎస్. రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ ప్రాజెక్టు

నీటి నుంచి ప్లాస్టిక్ వ్యర్థాల వడపోత..

ఎన్నో వ్యాధులకు ప్లాస్టిక్ కారణం. జలవనరులు ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితమవుతున్నాయి. వీటి వల్ల జల చరాలకు కూడా అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం తక్కువ ఖర్చుతో జలవనరుల్లో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఎలా వేరు చేయాలో వివరిస్తూ అచ్యుతాపురం మండలం హరిపాలెం హైస్కూల్ విద్యార్థులు ఎల్.యమున (8వ తరగతి), డి.కుశాల్ (7వ తరగతి) రూపొందించిన ట్రాష్ ట్రాప్ ఫర్ రివర్స్ అండ్ వాటర్ బాడీస్ ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుంది. వీరి ప్రాజెక్టుకు ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్ ఎ.అమ్మాజీ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు.

గ్రీన్ హౌస్ ఎఫెక్ట్

వాతావరణంలో ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా ఏర్పడే గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ తద్వారా ఏర్పడే గ్లోబల్ వార్మింగ్ దుష్ప్రభావాల నుంచి బయటపడడానికి అచ్యుతాపురం స్కూల్ విద్యార్థులు రూపకల్పన చేసిన గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ ప్రాజెక్టు అందర్నీ ఆలోచింపజేసింది. వాతావరణంలో ఉష్ణోగ్రత పెరుగుదలను అరికట్టేందుకు గ్రీనరీ పెంచుకోవడం వల్ల కలిగే లాభాలను ప్రాజెక్టులో వివరించింది విద్యార్థిని షరిమ్మల. అడవుల నిర్మూలన, శిలాజ ఇంధనాలను మండించడం వంటి మానవ కార్యకలాపాల వల్ల కలిగే పరిణామాలను విద్యార్థులు వివరించారు. వారికి వి. గాంధీ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు.

అనకాపల్లి బస్సు యాత్రకు భారీ ఏర్పాట్లు



సభా స్థలి వద్ద డీఎస్పీ సుబ్బరాజుతో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- పెద్ద ఎత్తున తరలిరానున్న పార్టీ శ్రేణులు, ప్రజలు
- ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్



సిద్ధమవుతున్న సభా వేదిక

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలో తొలి విడత సామాజిక సాధికార బస్సుయాత్ర ఈనెల 9వ తేదీన అనకాపల్లి సభతో ముగుస్తుందని, భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొనున్నందున విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. మంగళవారం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంతవరకు జరిగిన సభలన్నింటి కన్నా మిన్నగా అనకాపల్లి సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని చెప్పారు. పరిశీలకుడిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పర్యవేక్షణలో ఈనెల 9వ తేదీ సాయంత్రం 3 గంటలకు సభ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని చెప్పారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సభలో పాల్గొంటున్న ముఖ్య నేతలకు పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీతో ఆహ్వానం పలుకుతారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలను తెలియజేయడంతోపాటు, రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం పార్టీ శ్రేణులకు పలు సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. మంత్రి పర్యటనలో డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐ దాడి మోహన్‌రావు, ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి, కశింకోట మండలాల పార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గోవింద, మలసాల కిషోర్, పార్టీ నాయకులు, శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సుందరంగా క్రీడా మైదానం

సామాజిక సాధికార సభ జరగనున్న ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రధానమైన మూడు ముఖద్వారాల ద్వారా బహిరంగ సభకు వచ్చే ప్రజలను అనుమతిస్తారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు సరఫరా చేసేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కృషి



పరిశ్రమల అభివృద్ధి కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమల అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపన, అభివృద్ధి విషయంలో సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు ఇస్తూ ఉండాలన్నారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలు తప్పక పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి నుంచి కోడూరు వరకు నిర్మించే 2.8 కిలోమీటర్ల మేర రహదారి పనులను వెంటనే చేపట్టాలన్నారు. పరిశ్రమలకు ఇచ్చిన భూముల విషయంలో ఏమైనా సమస్యలు వచ్చినట్లయితే రెవెన్యూ, పరిశ్రమలు, సర్వే, ఏపీఐఐసీ శాఖలు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. లంకెలపాలెం నుంచి పరవాడ మీదుగా అచ్యుతాపురం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్‌ఎం. త్రినాథ్, జిల్లా పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యం

- నలుగురు పోలీసులను ఆర్మ్‌డ్ రిజర్వుకు అటాచ్ చేసిన ఎస్పీ



ఆర్మీ ఉద్యోగిని వ్యానులో ఎక్కించడానికి ప్రయత్నిస్తున్న పోలీసులు

పరవాడ: దిశ యాప్ డౌన్‌లోడ్ విషయంలో పరవాడ పోలీసులు ఓ ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన పరవాడలో కలకలం సృష్టించింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. పరవాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు పోలీసులు మంగళవారం స్థానిక వారపు సంతలో దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసులు సంతకు వచ్చే వినియోగదారులను దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ ఆర్మీ ఉద్యోగిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు కోరారు. ఆయన కూడా వెంటనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ చెప్పగా.. పోలీసులు రాసుకున్నారు. ఇంతలో ఆర్మీ ఉద్యోగికి అనుమానం వచ్చి.. మీకు నేమ్ ప్లేట్ లేదు.. మీ ఐడీ కార్డు చూపించాలని పోలీసులను కోరాడు. దీంతో ఓ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మమ్మల్ని ఐడీ కార్డు అడుగుతావా? అంటూ అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్‌తో కలిసి ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యం చేశారు. ఆర్మీ ఉద్యోగిని పోలీస్ స్టేషన్‌కు తరలించడానికి బలవంతంగా వ్యాను ఎక్కించే ప్రయత్నం చేశారు. చివరకు ఆర్మీ ఉద్యోగి ఐడీ కార్డును తీసుకుని వదిలేశారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పరవాడలో తమపై ఓ ఆర్మీ ఉద్యోగి దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసు సిబ్బంది స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు పోలీసులను ఆర్మ్‌డ్ రిజర్వుకు అటాచ్ చేస్తూ, విచారణకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాల స్థాయిలోనే డిజిటల్ విద్యకు ప్రాధాన్యం

- విద్యారంగ అభివృద్ధిలో సీఎం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం రూరల్: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, వారికి ఉచితంగా ట్యాబ్‌లను అందచేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదే అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కొనియాడారు. సాధారణ విద్యార్థులకే గాకుండా ఫిజికల్లీ ఛాలెంజెడ్ విద్యార్థులకు సైతం ట్యాబ్‌లను అందచేయడం రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధి, దివ్యాంగ విద్యార్థులకు శ్రేయస్సుకు తీసుకుంటున్న శ్రద్ధలకు తార్కాణమని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలోని సహిత విద్యా వనరుల కేంద్రం (భవిత)లో జిల్లా స్థాయి దివ్యాంగ విద్యార్థుల (వినికిడి లోపం, దృష్టిలోపం)కు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మశ్రీ విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్న దివ్యాంగ విద్యార్థులు సులభంగా విద్యాభ్యాసం చేయడానికి వీలుగా 33 యాప్‌లను ఇన్‌స్టాల్ చేసి డిజిటల్ విద్యను అందచేయడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేసిన సంగతి గుర్తు చేశారు. జిల్లా సహిత విద్యా సమన్వయాధికారిణి శకుంతల మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 165 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. డిజిటల్ ఎడ్యుకేషన్ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా కార్యక్రమంలో భాగంగా సహిత విద్యా విభాగం ద్వారా ట్యాబ్‌ల పంపిణీ జరుగుతుందని చెప్పారు. జిల్లాలోని ఆయా మండలాల్లోని సహిత కేంద్రాల ఐఈఆర్‌పీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు ట్యాబ్‌లకు అర్హులైన విద్యార్థులను వాటి వినియోగానికి కార్యోన్ముఖులను చేసారని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయలక్ష్మి, ఎంపీపీ గాడి కాసులమ్మ, చోడవరం గ్రామ సర్పంచ్ బి.శ్రీను, జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ డి.కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు, సహిత కేంద్రాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



లక్ష్మి

రోలుగుంట : అత్తవారింటికి వెళ్తానని రావికమతం మండలం జెడ్. కొత్తపట్నంలో పుట్టింటి నుంచి బయలుదేరిన పెదపూడి లక్ష్మి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మికి పదేళ్ల క్రితం రోలుగుంట మండలం వడ్డిప గ్రామానికి చెందిన పెదపూడి అడవిరాజుతో వివాహమైంది. గతేడాదిగా ఇంటి సమస్యల కారణంగా ఆమె మానసిక వ్యథతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 1న పుట్టింటి నుంచి అత్తవారింటికి వచ్చేందుకు బయలుదేరింది. ఇంత వరకూ ఆమె చేరలేదు మతిస్థిమితం లేని లక్ష్మి ఎప్పటి మదిరిగానే తిరిగి వస్తుందని ఆదివారం వరకూ ఎదురు చూసిన తల్లి ఎల్లమ్మ సోమవారం పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మంగళవారం తెలిపారు.

1.13 కోట్ల పని దినాల లక్ష్యం

- కూలీలకు వేతన రూపంలో అందనున్న రూ.307 కోట్లు
- ఉపాధి కల్పనకు అధికారుల కసరత్తు




ఉపాధి ప్రణాళికపై సమీక్షిస్తున్న అధికారులు

అనకాపల్లి రూరల్: జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 1.13 కోట్ల పని దినాలు కల్పించి వలసలను నివారించాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ పని దినాల ద్వారా వేతనదారులకు వేతనాల రూపంలో రూ.307 కోట్లు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందుకోసం గ్రామాల్లో చేపట్టాల్సిన, గుర్తించాల్సిన పనుల గురించి సన్నద్ధతా సమావేశం మంగళవారం అనకాపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. డ్వామా పీడీ ఇ. సందీప్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ డి. మల్లికార్జున హాజరయ్యారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో గుర్తించాల్సిన కొత్త పనులు, గుర్తించిన పనులకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ, పండ్ల తోటల పెంపకం, ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులకు, గ్రామాల్లో వ్యవసాయ రంగానికి ఉపయోగపడేలా పనులకు ప్రాధాన్యమివ్వాలని అధికారులు సూచించారు. ఇందుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనులు గుర్తించి, గ్రామ సభల్లో తీర్మానాలు పద్ధతి ప్రకారం చేయించాలని సూచించారు. మొత్తం 97 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ప్రణాళిక, పనుల వివరాలను కలెక్టరుకు పంపించాల్సి ఉంటుందని వివరించారు. ఉపాధి హామీ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న క్లస్టర్ ఏపీడీ, ఏపీవో, ఈసీలు, సాంకేతిక సహాయకులకు ఇందుకు సంబంధించి శిక్షణనిస్తామని డ్వామా పీడీ తెలిపారు. డ్వామా అదనపు పీడీ రోజారాణి, అసిస్టెంట్ పీడీలు జె. మణికుమార్, డీఎల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- క్షేత్రస్థాయిలో లోపాలు అధిగమించాలి
- ఆర్డీవో హెచ్.వి.జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు పరిశ్రమల భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం పరిశ్రమల నిర్వాహకులకు సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కర్మాగారాల తనిఖీ శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల భద్రతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల్లో లోపాలను అధిగమించాలన్నారు. పరిశ్రమలను ప్రజలతో అనుసంధానం చేసి ప్రమాదాలపై అప్రమత్తం చేయాలన్నారు. మాక్ డ్రిల్ తరచూ నిర్వహించాలన్నారు. భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల నిర్వాహకులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చినట్టయితే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెంచడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పైడి చిన్నారావు మాట్లాడుతూ పరిశ్రమల్లో అమలవుతున్న భద్రతా చర్యలపై చర్చించడమే లోకల్ క్రైసిస్ గ్రూపు సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు.

ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రతి మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు పరిశ్రమల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆఫ్ సైట్, ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్రణాళిక పరిశ్రమల్లో పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో డెక్కన్ ఫైన్ కెమికల్స్, హెట్రో, హెచ్‌పీసీఎల్, వివిఎస్‌పీఎల్, శ్రీసాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్, పయనీర్ అల్యూమినియం, కోస్టల్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిశ్రమల అధికారులు తమ పరిశ్రమల్లో తీసుకుంటున్న భద్రతా చర్యలపై ప్రత్యేక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం తహసీల్దార్ అన్నాజీరావు, ఫైర్, పోలీసు సిబ్బంది, కేశవరం సర్పంచ్ ఎం.గోవింద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి అమర్‌నాథ్ పర్యటన

కశింకోట: కశింకోట, వెదురుపర్తి గ్రామాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం ఉదయం 9 గంటలకు సందర్శించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం తెలిపారు. మంత్రి నిధులతో స్థానిక రెల్లి కాలనీలో నిర్మించిన సామాజిక భవనం, వడ్డి వీధిలో రూ.15 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ, వెదురుపర్తి గ్రామంలో సచివాలయ భవనాన్ని బస్సు యాత్ర మంత్రుల బృందం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు హాజరుకావాల్సిందిగా కోరారు.

రైతు భరోసా నిధుల జమ

కశింకోట: మండలంలోని 10,199 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు 5వ ఏడాది రెండో విడతగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా నగదును మంగళవారం జమ చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా నగదు చెల్లింపును శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మండలంలోని రైతులకు మొత్తం రూ.4.21 కోట్లపైబడి నిధులు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న తెలిపారు. ఇప్పటికే రైతు భరోసా పొందుతున్న వారితోపాటు కొత్తవారు, 28 మంది కౌలు రైతులు, ముగ్గురు దేవదాయ శాఖ భూమి సాగు రైతులకు రైతు భరోసా సొమ్ము మంజూరైనట్లు పేర్కొన్నారు. రైతు భరోసా, కిసాన్ భరోసాగా చెరో రూ.2 వేలు చొప్పున జమచేస్తున్నట్లు వెల్లడించారు.

9 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రవిరాం జవహర్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 9 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 42 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 9 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదు రోజులు ఆస్పత్రిలో వసతితోపాటు, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, వైద్యసహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 2,153 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,800	4,420
రెండో రకం	3,520	4,190
మూడోరకం	3,240	3,780

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
మ్యాడ్	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
---	: వెంకటేశ్వర
ఘోస్ట్	: శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-2 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 366 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

మాల ధారణం.. నియమాల తోరణం

అయ్యప్ప మండల దీక్ష. కఠోర నియమాలు.. రెండు పూటలా స్వామి శరణు ఘోష. 41 రోజుల క్రమబద్ధమైన ఆధ్యాత్మిక జీవితం. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో అయ్యప్ప దీక్షలు ప్రారంభమయ్యాయి. పలువురు గురుస్వాముల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో పీఠాలు ఏర్పడ్డాయి. కన్నె స్వాములు, తొలిసారిగా మాల ధరిస్తున్న స్వాములతో అయ్యప్ప పీఠాలు కళకళలాడుతున్నాయి.



గవరపాలెం శ్రీ గౌరీ అయ్యప్ప ఆశ్రమంలో పూజలు చేస్తున్న స్వాములు

- భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మండల దీక్షలు
- ఆధ్యాత్మిక శోభతో అయ్యప్ప మందిరాలు

తుమ్మపాల: అయ్యప్ప మాలధారణ.. భక్తితోపాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఏటా శీతాకాలానికి ముందే భక్తులు మాలధారణ చేస్తుంటారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు స్వామి మండల దీక్ష చేపట్టారు. జిల్లాలో అనకాపల్లి పట్టణం అయ్యప్ప మాలధారణకు ప్రసిద్ధి. ఉదయం, సాయంత్రం అయ్యప్ప దీక్షధారుల పూజలతో పట్టణం, మండలంలోని గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్నాయి. అనకాపల్లి, కశింకోట మండలాల్లో వందలాది మంది మాలధారణ చేసి స్వామిని భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు.

41 రోజుల కఠోర దీక్ష: నియమ నిష్టలతో ఆచరించే అయ్యప్ప దీక్ష శారీరక ఆరోగ్యాన్నే కాకుండా మానసిక ప్రశాంతతను కూడా చేకూరుస్తుంది. మనిషిలో సత్ప్రవర్తనను మేల్కొలిపి, క్రమశిక్షణకు బాటలు వేస్తుంది. సాత్వికాహారం, అందరినీ సమానంగా చూడడం వంటి నియమాలు దీక్షధారుల వ్యక్తిత్వాన్ని ఉత్తేజపరుస్తాయి. 41 రోజుల కఠోర దీక్ష పూర్తి చేసుకుని ఇరుముళ్ల కట్టి, అయ్యప్ప కొలువైన శబరిమలై వెళ్తారు. దీక్ష సమయంలో చేసే పూజల్లో కూడా ఆరోగ్యపరమైన రహస్యాలు దాగివున్నాయని గురుస్వాములు చెబుతారు.

చన్నీటి స్నానంతో ఉత్తేజం: ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం చేయడంతో శరీరంలో శక్తి, ఏకాగ్రత, ఉత్తేజం పెరుగుతాయంటారు. చన్నీటి శిరః స్నానంతో రక్తపోటు తగ్గి, జీర్ణశక్తి అభివృద్ధి చెందుతుంది.

చందనంతో చల్లదనం: నుదుటిపై చందనం, కుంకుమ, విభూతి ధరించడం వల్ల చల్లదనంతో పాటు, మానసిక ప్రశాంతత కలుగుతాయి. కాళ్లకు చెప్పులు లేకుండా నడవడంతో చిన్న చిన్న రాళ్లు పాదాలకు తగిలి నరాల్లో స్పందన పెరుగుతుంది.

నల్లని వస్త్రాలతో వెచ్చదనం: శీతాకాలంలో స్వాములు నల్లటి వస్త్రాన్ని ధరిస్తారు. నల్లటి వస్త్రాలు వెచ్చదనాన్ని నిలుపుతాయి. చలికాలంలో నల్లటి వస్త్రాలు శరీరానికి ఎంతో మేలు. భక్తులు శని ప్రభావానికి గురవకుండా ఉండేందుకు నల్లని వస్త్రాలు ధరిస్తారని పూజా నియమాలు చెప్తున్నాయి.

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం: మండల దీక్ష ఆధ్యాత్మికతతో పాటు, ఆరోగ్యాన్ని కూడా పెంపొందిస్తుంది. 41 రోజుల పాటు చన్నీటి స్నానం, ఒంటిపూట భోజనం, నిత్యం దైవారాధన మాలధారుల జీవితాలపై చక్కటి ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు.

అయ్యప్ప భక్తులకు ఆసరా



ఆర్థిక ఇబ్బందులతో అయ్యప్ప దీక్షకు వెనుకంజవేసేవారికి ఆసరాగా నిలుస్తున్నారు కశింకోట మండలం పిసినికాడకు చెందిన గురుస్వామి వేగి రామకోటి. 32 పర్యాయాలు అయ్యప్ప మండల దీక్ష ధరించి, స్వామిని దర్శించుకున్నారు. ఈ ప్రాంత భక్తులకు గురుస్వామిగా మార్గనిర్దేశం చేస్తున్నారు. ఈసారి కూడా ఏకాదశి పర్వదినాన పలు గ్రామాల నుంచి 18 మంది కన్నె స్వాములను మాలధారణ చేయించారు. వీరికి అవసరమైన పూజా పీఠాన్ని ఏర్పాటు చేసి, దీక్షా కాలంలో వారికి అవసరమైన అల్పాహారం, భిక్ష అందిస్తున్నారు. అందుకే ఏటా గురుస్వామి రామకోటి పీఠంలో మాలధారణ చేసేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు.

విశ్వాసంతో దీక్ష చేపట్టాలి



గాడి తప్పుతున్న జీవితాల్ని తీర్చిదిద్దేందుకు అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుంది. చెడు అలవాట్లను దూరం చేస్తుంది. ఆధ్యాత్మిక చింతన, దృఢ సంకల్పం సిద్ధిస్తుంది. స్వామిపై విశ్వాసంతో దీక్ష చేపడితే అయ్యప్ప కృపకు పాత్రులు కావొచ్చు.

-వి.పరమేష్, అయ్యప్ప భక్తుడు

సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ రేపు



బొడ్డేడ ప్రసాద్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అనకాపల్లిటౌన్: సామాజిక సాధికార బస్సుయాత్ర ఈ నెల 9న అనకాపల్లి మండలం మారేడుపూడి జాతీయ రహదారిలో ప్రారంభం కానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైవే మీదుగా కశింకోట చేరుకుని, అక్కడ దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మంత్రులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో తొలుత కశింకోటలో పలు అభివృద్ధి పనులను మంత్రులు ప్రారంభిస్తారన్నారు. అనంతరం బస్సుయాత్ర అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడామైదానానికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుని అక్కడ జరిగే భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిపై మంత్రులు ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఉపముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ సత్యవతి విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కమిటీలు, దేవాలయాల కమిటీలు, జిల్లా సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలి



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న సిద్ధార్థ అసోసియేషన్ సభ్యులు

తుమ్మపాల: అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌలభ్యం కోసం అన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే స్టేషన్ వద్ద ప్లకార్డులతో మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం ఎంపీ బీవీ సత్యవతికి సంస్థ అధ్యక్షుడు బల్లా నాగభూషణం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జిల్లాగా ఏర్పడ్డాక జిల్లావాసులకు అనకాపల్లి రైల్వే స్టేషన్ ప్రధాన కేంద్రంగా మారిందన్నారు. విశాఖ తర్వాత రైల్వే శాఖకు ఎక్కువ ఆదాయం అనకాపల్లి కేంద్రంగా వస్తుందన్నారు. ఇక్కడ అన్ని రైళ్లకు హాల్ట్ ఏర్పాటయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణమోహన్, కె.రామారావు, జిల్లా బుద్ధిస్ట్స్ సొసైటీ అధ్యక్షుడు నేలపూడి బాలరాజు, పొట్టి శ్రీరాములు, సంస్థ చైర్మన్ పిరాట్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



తేగాడలో ట్రాక్టర్‌తో చదును చేస్తున్న సచివాలయ భవన ప్రాంగణం



జగనన్న కాలనీ వద్ద ఏర్పాటు చేస్తున్న శిలాఫలకం

కశింకోట: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని తేగాడ గ్రామంలో ఈ నెల 9న సామాజిక సాధికార బస్సు యాత్రకు రానున్న మంత్రులతో జరపనున్న పలు పథకాల ప్రారంభోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆయన పరిశీలించి, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. తేగాడలో ఒకేచోట ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం వెల్‌నెస్ సెంటర్ భవనాల ప్రారంభోత్సవం, వైఎస్సార్ జగనన్న కాలనీ, ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో నాడు-నేడు పనుల ప్రారంభానికి వేర్వేరుగా శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. ఆయా భవనాలను మంత్రి పరిశీలించారు. ప్రారంభోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, స్థానిక నాయకుడు నీటిపల్లి దివాకర్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలకు ఏర్పాట్లు: సచివాలయం వద్ద శిలా ఫలకాలు ఏర్పాటు చేయడానికి, బస్సుయాత్ర బస్సు తిరగడానికి వీలుగా మైదానాన్ని చదును చేస్తున్నారు. జగనన్న కాలనీ వద్ద శిలాఫలకం దిమ్మెను నిర్మించారు. బుధవారం నాటికి వీటిని సిద్ధం చేయాల్సి ఉండటంతో, మంగళవారం రాత్రి కూడా పనులు కొనసాగించారు.

నాడు-నేడుతో ప్రభుత్వ స్కూళ్లకు కార్పొరేట్ వసతులు



కొండకొప్పాక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు మనబడి, నాడు-నేడు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం కొండకొప్పాకలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఎంపీపీ స్కూల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న బోధన, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద దశల వారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే సీఎం జగన్ లక్ష్యంగా చేసుకున్నారని కొనియాడారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ వసతి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అంగన్‌వాడీలో ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో తన సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అంతకుముందు శ్రీపైడితల్లి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వామాల కాశీ, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డపాటి చినరాజారావు, పొలిమేర బాలాజీ, ఇంటి త్రినాథ్, మొల్లి రమణబాబు, నెట్టిమి రామచంద్ర, చింతల రాము, బత్తిన అప్పారావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శ్రీకారం

కశింకోట: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఇందిరా కాలనీ నుంచి భవానీ కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి మార్గం సుగమమయింది. ఇందుకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.15 లక్షలు మంజూరు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్‌వైజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం

ఉపాధి పథకం విజిలెన్స్ కమిషనర్ డీవీ మల్లికార్జున



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున

సబ్బవరం: ఉపాధి పనుల గుర్తింపు, నిర్వహణలో సాగునీటి వనరుల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధి పథకం విజిలెన్స్ కమిషనర్ డీవీ మల్లికార్జున సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీడీవో రమేష్ నాయుడు అధ్యక్షతన సబ్బవరం, యలమంచిలి, చోడవరం, కె.కోటపాడు, పెందుర్తి మండలాల ఉపాధి పథకం అధికారులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఉపాధి పనుల నిర్వహణకు నల్లరేగులపాలెం, నారపాడు, బంగారమ్మపాలెం. గ్రామాల్లో గుర్తించిన రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో మినీ సర్క్యులేషన్ ట్యాంకులు, ఫారం పాండ్, బౌండ్రీ ట్రెంచ్ పనులు చేపట్టేందుకు కొండవాలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా విస్తృతంగా నిర్వహిస్తున్న చెరువులు, కాలువ పనులకు ప్రాధాన్యం తగ్గించి మిగతా 96 రకాల పనులను గుర్తించి, సకాలంలో పూర్తి చేసేలా పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఇప్పటి వరకూ జరిగిన ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీలు మణికుమార్, శ్రీనివాస్, అంజనేయులు, ఏపీవోలు శ్రీనివాసరావు, అప్పలరాజు, ఈఏలు పరమేష్ రామానాయుడు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

డీఎస్ఎన్ఎల్‌యూ ప్రొఫెసర్ విజయలక్ష్మి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయలక్ష్మి

సబ్బవరం: మహిళలు, బాలికలు తమ హక్కులు, వాటికి సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి సూచించారు. మేహాద్రి గెడ్డలోని గురుకుల పాఠశాలలో మంగళవారం డీఎస్ఎన్ఎల్‌యూ సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా ఆధ్వర్యంలో మహిళలు, బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నేడు మహిళలు అనేక రకాల హింసలకు గురవుతున్నారన్నారు. చట్టాల పట్ల సరైన అవగాహన లేక రక్షణ పొందలేకపోతున్నారన్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు వల్ల ఆడబిడ్డలకు తల్లిదండ్రులు సరైన విద్య అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలుసుకోలేక చేస్తున్న పనులతో చిన్నారులు బాల్యాన్ని కోల్పోవడమే కాక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 రూపొందించి చిన్నారుల భవిష్యత్తును కాపాడే దిశగా అడుగులు వేయడం జరుగుతోందన్నారు. బాల్య వివాహాలు చేస్తే. కఠినమైన శిక్షలే కాకుండా భారీ జరిమానాలు ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగం మహిళలు, శిశువుల రక్షణకు ఆర్టికల్ 14,15,16 రూపొందించిందన్నారు. వరకట్న నిషేధ చట్టం 1961 ద్వారా మహిళలు రక్షణ పొందవచ్చని వివరించారు. ఇండియన్ పీనల్ కోడ్ 198ఎ, 30 40, గృహ హింస నిరోధక చట్టం 2005 వంటి చట్టాలు మహిళలకు రక్షణ కల్పిస్తాయని వివరించారు. సమాన వేతన చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం గురించి విద్యార్థినులకు వివరించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎస్ భాగ్యలక్ష్మి, పలువురు విద్యార్థినులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం




సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ సిన్హాకు కేక్ తినిపిస్తున్న అధికారులు

పరవాడ: ఎన్టీపీసీ 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ పరిపాలన భవనంలో ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎండీ గురుదీప్‌సింగ్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. సంస్థ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నారని ఉద్యోగులను అభినందించారు. అనంతరం సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ 48 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో 73,874 ఎండబ్ల్యూ వృద్ధి సాధించిందని వివరించారు. రానున్న సంవత్సరంలో నిర్దేశించిన మైలురాళ్లను చేరుకోవడానికి కొత్త శక్తితో కష్టపడి పనిచేయాలని కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ వివిధ రంగాల్లో సాధించిన అవార్డులు, ప్రశంసలను వివరించారు. వేడుకల్లో భాగంగా హిందీ పక్వాడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు ఎస్.గోవిందరాజన్, అంజూ సిన్హా, హెచ్‌ఆర్ హెడ్ రుమాడీ శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వి.కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

రాంపురం బైపాస్‌పై రెండు లారీల ఢీ

డ్రైవర్లకు గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన లారీలు

పెందుర్తి: పెందుర్తి మండలం రాంపురం సమీపంలోని అనకాపల్లి-ఆనందపురం బైపాస్ సర్వీస్ రోడ్డులో మంగళవారం రెండు లారీలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి.. విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలోని బొగ్గు యార్డు నుంచి పరవాడలోని హిందుజా కంపెనీకి బొగ్గు లోడుతో లారీ వస్తోంది. లారీ రాంపురం వంతెన వద్దకు వచ్చేసరికి సబ్బవరం నుంచి పెందుర్తి వైపు కంకర లోడుతో వెళుతున్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు లారీల క్యాబిన్లు నుజ్జయ్యాయి. బొగ్గు లారీ డ్రైవర్ జానీ కాలికి తీవ్ర గాయమైంది. టిప్పర్ లారీ డ్రైవర్‌కు నుదుటిపై తీవ్ర గాయమైంది. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పెందుర్తి సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన మిస్టర్ అండ్ మిస్ హిమశేఖర్



ఫ్యాషన్ షోలో హిమశేఖర్ కళాశాల విద్యార్థులు

అనకాపల్లి టౌన్: స్థానిక డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో రోటరాక్ట్ ఆధ్వర్యంలో సంప్రదాయ ఫ్యాషన్ షోలో భాగంగా మిస్టర్ అండ్ మిస్ హిమశేఖర్ పోటీలు మంగళవారం జరిగాయి. విద్యార్థులు తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఉత్సాహంగా ర్యాంప్ వాక్ చేశారు. ప్రథమ స్థానంలో నిలిచి మిస్ హిమశేఖర్ కిరీటాన్ని పి.నీరజ దక్కించుకుంది. ద్వితీయ స్థానంలో కీర్తి, తృతీయ స్థానంలో అనిష, మిస్టర్ హిమశేఖర్ విభాగంలో జె.తుషార్, మోహన్‌కుమార్, కె.చైతన్య మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కళాశాల కరస్పాండెంట్ కె.జనార్దన్ మాట్లాడుతూ కళాశాల స్థాయిలో సంప్రదాయ ఫ్యాషన్ షోలను నిర్వహించడం వల్ల విద్యార్థులకు సంస్కృతిపై అవగాహన పెరుగుతుందన్నారు. ర్యాంపుపై నడవడం విద్యార్థుల్లో ఆత్మస్థైర్యానికి దోహద పడుతుందన్నారు. డైరెక్టర్ కె.పరమేష్, ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ ఫణి, వైస్ ప్రెసిడెంట్ వసంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సు సర్టిఫికెట్ల పంపిణీ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో దీపిక లేడీస్ క్లబ్ సహకారంతో మూడు నెలల పాటు నిర్వహించిన బ్యూటీషియన్ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న 25 మందికి దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూసిన్హా సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ద్వారా వ్యక్తులకు సాధికారిత అందించడమే లక్ష్యమన్నారు సమాజంలో స్వీయ విశ్వాసం, వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడానికి ఎన్టీపీసీ అంకితభావంతో కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ రుమాడీశర్మ, సీఎస్సార్ విభాగం ప్రతినిధి ప్రకాశరావు, శివ ప్రతాప్‌సింగ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై విస్తృత అవగాహన



దిశ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

సబ్బవరం: దిశ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్‌పై అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు సబ్బవరం పోలీసులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పలు చోట్ల ప్రజలతో మమేకమై దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు దిశ యాప్ ఎంతో అవసరం అన్నారు. ప్రతి విద్యార్థి, మహిళ రక్షణ కోసం తమ స్మార్ట్ ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. దిశ యాప్ వల్ల మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.